ఒకరి ప్రాణంతీసిన
అల్లరి పిల్లవాడు
తల్లి చాటున
ఎలా దాక్కున్నాడు?

# జాతస్యమరణం

రావర్ల మురళీ
మోహనరావు
కధ

1963.

అదో హైస్కూలు.. కాదు కాదు.. ఇంకా హైస్కూలు కాలేదు.. మాడిల్ స్కూలే!

మా వూర్నుంచి ఆ స్కూలు కెళ్లాలంటే మూడు మైళ్లు నడవాలి.

నాన్న ఎ.సి.సి.లో కూడా చేరమన్నాడు.

రోజూ మూడు మూడు ఆరు మైళ్లు.

పదేళ్లకే...

కాళ్లు పడిపోతాయి.

ఆరు, ఏడు క్లాసులు ఊళ్లో.

హైస్కూలు శాంక్షనయ్యిందిట. ఊరిబయట బిల్డింగు కూడా కడుతున్నారు.

అయిదెకరాల్లో.

ఈ స్కూలు బిల్డింగులన్నీ ఒకే ఇంజనీరు—

ఇంజనీయరు కాదుట— ఆర్కిటెక్టుట— నాన్న చెప్పాడు.

ఆయన డిజైను చేస్తాడుట.

అన్నీ ఒకేలా ఎందుకో!

కట్టే వాళ్లకు సులభమవుతుందనా!

ఏమో! నాన్న చెప్పలేదు.

పెద్ద పెద్ద గుంటలు త్రవ్వారు. ఫౌండేషను వేస్తున్నారుట. పునాది.

చదువులో కూడా మంచి పునాది ఉంటేకాని బాగా చదువు రాదుట.

అయిదేళ్లకే అ, ఆలతోపాటు ఏబీసీడీలు కూడా దిద్దమన్నాడు నాన్న.

ఇరవయ్యేక్కాలు—

అ, ఆలు—

ఏబీసీడీలు—




[illegible]—
చైత్ర, వైశాఖాలు—
అశ్వని, భరణిలు—
భవ బాలనలు

శ్రీ రామ [illegible]—
ఉప్పుకప్పురంబు..
అవును. ఉప్పుకర్పూరం పోలిక ఒక్క-
టే! రుచులు వేరుకదా!

అలాగే స్కూలు బిల్డింగుల పోలికలూ ఒక్కటే! మరి ఏవిటి వేరు!

పురుషులందు పుణ్య పురుషులు వేరుట !

పాపప్పురుషులు కూడా వేరుగా ఉంటారేమో!

మరి పాపం పుణ్యం చెయ్యని వాళ్లంటే.. .. వాళ్ల ఉత్త పురుషులా...?

ఉన్నారా?

ఉంటే మరి ఉప్పు కప్పురాల్లాగే మూడోది?

వేమన కనిపిస్తే బావుంటుంది.

ఆయనకు మంచి పునాది ఉండేదేమో?

స్కూలొచ్చేసంది.

ఇవాళ ఏసీసీ సాయంకాలమట. పుల్లారెడ్డి మాస్టారు చెప్పాడు.

ఒకోరోజు ఉదయమంటాడు, మరో రోజు సాయంకాలం.

ఈ ఏసీసీ యూనిఫారం వేసుకు పోతుంటే బూడిద గుడ్డలంటూ ఆడపిల్లలంతా నవ్వుతారు.

'నవ్వనీ, వాళ్ల పళ్ళే కనపడతాయంటారు మాస్టారు. ఆయనకేం సైకిలు మీద ఇంటికెళ్లి నిముషాలమీద డ్రస్సు మార్చుకుని వచ్చి 'రయ్'మని విజిల్ వేస్తాడు.

అందరం గ్రౌండ్‌లోకి పరిగెత్తాలి.

ఈశ్వర్రెడ్డి పిలుస్తున్నాడు.

సాయంకాలం వాడు ఏసీసీకి రాడుట.

'ఎక్కడికెళతావురా' అంటే 'అక్కగారింటి'కన్నాడు. అక్కణ్ణుంచి చొక్కా జేబులో బియ్యంతోపాటు నీళ్ళ, బెల్లం కూడా పోసుకొచ్చుంటాడు. వాడి చొక్కా జేబులన్నీ మరకలే! ఎప్పుడూ చొంగ కారుస్తూ ఉంటాడు. స్కూలు బిల్డింగు ఎప్పటికి పూర్తవుతుందో?

రాళ్ళ, సున్నం, ఇసుక లారీల్లో వస్తున్నాయి. గచ్చు గానుగ స్కూలు పక్కనే కట్టేరు. గానుగాడే కుర్రాడు— వాళ్ల నాన్న గాని అక్కడ లేకపోతే ఎంచక్కా గానుగ్గర్ర మీద కూర్చుని ఎడ్లని తోలుతుంటాడు. నన్నోసారి కూర్చోనిస్తాడేమో అడిగి చూడాలి

ఈ లారీల వాళ్ల మమ్మల్ని స్కూలు నుంచి ఊరిదాకా ఎక్కించుకోవచ్చుగా?

రేపు ఈశ్వర్రెడ్డి వచ్చాక చెప్పాలి. వాడైతే అడుగుతాడు.

రోజూ ఆరుమైళ్లు నడవాలి, కాళ్లు నెప్పులు పుడతాయంటే 'జామాయిల్' రుద్దుకొమ్మందమ్మ.

అది రుద్దుకుంటే నెప్పులు తగ్గుతాయా ?

ఈశ్వర్రెడ్డొచ్చేడు.

లారీల సంగతి వాడికి చెప్పేను.

ఆశీర్వాదం కూడా అడుగుతానన్నాడు.

భాషా మాత్రం 'వాణ్ణడిగేదేంది. రోడ్డు కడ్డంగా నిలబడ్తే సరి' అంటాడు.

లారీ కాస్తా మా మీదనుంచి పోతే?

అమ్మ బాబోయ్! చచ్చిపోమూ?

రోడ్డు వారగా నుంచిని చేతులూపుతూ 'ఇస్కూలు, ఇస్కూలు' అంటూ గట్టిగా అరిచేరు భాషా, ఈశ్వర్రెడ్డి.

లారీ ఆగలేదు.

అందులోని క్లీనరబ్బాయి మమ్మల్ని

చూసి వెక్కిరిస్తూ చేతులు తారంగం తిప్పేడు... వెధవాని!

వేలెడంత... కాదు.. చెయ్యెత్తు లేడు... వెధవ... ఎన్ని పోజులు కొడతాడూ?

లారీలో కూర్చుని ఊరికే తలుపులు బాదేస్తుంటాడు.

'సైడిమ్మ'నిట!

ఎవరన్నా అడ్డం ఉంటేకదా సైడివ్వటానికి?

అయినా వాడు తలుపులు బాదడం మానడు.

లారీ అన్లోడవుతూ ఉంటే డ్రైవరు చూడకుండా వీడు బీడీలు కాలుస్తాడు.

బీడీలు కాలిస్తే ఏమవుతుంది? చాలా ఉషారుగా ఉంటుందిట.

ఒకసారి కాల్చి చూస్తే?

అమ్మో... నాన్నకు తెలిస్తే ఇంకేమైనా ఉందీ? వీపు విమానం మోత మోగిస్తాడు.

అవునూ... విమానం ఎందుకంత శబ్దం చేస్తుంది... బస్సు... లారీ... ఇవన్నీ అంత శబ్దం చెయ్యవు కదా?

విమానం చాలా పెద్దదిట. బోల్డు బస్సులంత ఉంటుందిట. అందుకే కాబోలు అంత శబ్దం!

విమానంలో బీడీలు తాగనిస్తారా?

డబ్బున్నవాళ్లు బీడీలు తాగరట కదా. సిగరెట్లు కాలుస్తారట.

ఎవరన్నా సిగరెట్టు కాలుస్తుంటే కమ్మని వాసనొస్తుంటుంది.


మరి బీడీల వాసన అలా ఉండదేవిటి?

బీడీల్ని పొగాకుతో చేసినా దానిమీద చుట్టిన 'టుంకి' ఆకు కాలడం వల్ల ఆ వాసనొస్తుందిట.

క్లీనరు వెధవే చెప్పేడు.

'మమ్మల్నెందుకు లారీలో ఎక్కించుకోరా' అంటే 'ట్రేకినస్పెక్టరు పట్టుకుంటాడు. లారీలో మనుషులెక్కకూడ'దంటాడు వాడు.

మరి కూలీలో? వాళ్లుంటారుగా



లారీలో! వాళ్లు మనుషులు కాదూ?

ఆ మాటంటే వాడు 'అవన్నీ ఉస్తాద్ నడగమంటాడు.

ఉస్తాదంటే డ్రైవరన్నమాట.

లారీ ఆపకపోయేసరికి మా జట్టులో అందరికీ కోపం వచ్చేసింది.

లారీలు ఖాళీగా వెళుతున్నా మమ్మల్నె క్కించుకోక పోవడవంటే?!

హైస్కూలు కుర్రాళ్ల సత్తా ఏవిటో ఆ లారీల వాళ్లకి చూపించాలన్నాడు భాషా. వీళ్లోదో గొడవ పెట్టుకుంటే అందరమూ ఇరుకున పడతామేమోనని నా భయం

ఇరుకంటే గుర్తొచ్చింది.

మా హైస్కూలుండే ఊళ్లో వీధులన్నీ చాలా ఇరుగ్గా ఉంటాయి.

మరి ఈ ఊళ్లో హైస్కూలెందుకు పెట్టారని నాన్న నడిగాను.

మా ఊళ్లో హైస్కూలు పెట్టాలంటే రెండకరాల పొలం, లక్ష రూపాయల డబ్బు ఊరివాళ్లిచ్చుకోవాలన్నారుట గవర్మెంటువాళ్లు.

మా ఊళ్లో అవివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదుట. అవతలి ఊళ్లో ఉంటున్న సమితి ప్రెసిడెంటు తన భూమిని ఇచ్చేశాట్ట. అయిదెకరాలు. అందుకే హైస్కూలా ఊళ్లో కదుతున్నారన్నాడు నాన్న.

లక్ష రూపాయలంటే బోల్డు డబ్బు కదా! ఎవరి దగ్గరుంటుంది?

అలాగే హాస్పిటలు కూడా ఆ ఊరికెళ్లిపోయింది. మా ఊరే... ఏవీ లేకుండా మిగిలిపోయింది.

ఇవాళ కూడా ఏసీసీ సాయంకాలమేనట! వర్షం వచ్చేలా ఉంది.

సాయంకాలం పెరేడంటే ఏడో.. ఏడున్నరో అవుతుంది.

పెరేడెగ్గొడదామన్నాడు భాషా.

ఈశ్వర్రెడ్డి, ఆశీర్వాదం ఒప్పుకోలేదు.

పెరేడ్కి వెళ్లాం.

ఇవ్వాళ పుల్లారెడ్డి మాస్టారు తెల్ల డ్రస్సులో వచ్చేడు.

పెరేడయ్యేసరికి ఏడయ్యింది.

కాళ్లంతా నొప్పులు

మళ్లీ మూడుమైళ్లు నడవాలి.

తలుచుకుంటేనే భయమేస్తోంది.

ఇవాళేది ఏమైనా లారీలో వెళ్లాలి.

భాషా లారీకి అడ్డంగా నిలబడదాం అన్నాడు.

మిగతా ఇద్దరూ ఒప్పుకున్నా నాకు మాత్రం జంకుగానే ఉంది.

లారీలు వస్తూ పోతున్నాయి.

ఇంత ఇసక ఎక్కణ్ణుంచి తెస్తారో?

గుండ్లకమ్మ నుంచి తెస్తారుట. అది పెద్ద నదా? కాని ఆంధ్రప్రదేశ్ పటంలో లేదుగా?

గోదావరి, కృష్ణ, తుంగభద్ర, పెన్న... ఇవి మాత్రమే ఉన్నాయి.

అవి జీవనదులట.

గుండ్లకమ్మ కాదేమో?

లారీకి అడ్డం రోడ్డుమీద నిలబడ్డాం.

క్లీనరు వెధవ తలుపులు బాదినా కేకలు వేసినా మేం కదల్లేదు.

లారీ ఆపి డ్రైవరు దిగొచ్చేడు.బుర్ర మీసాలూ, వాడూ భయంకరంగా ఉన్నాడు.

ఇలాంటి మనిషిని ఎక్కడో చూశానే?!

ఎక్కడబ్బా?

ఆ... సినిమాలో!

ఎస్వీ రంగారావు!... ఏ సినిమా?... ఏదబ్బా..?

గుర్తు రావడం లేదు..

డ్రైవరు మాత్రం చెడామడా తిడుతున్నాడు.

లారీ మామీద నుంచి పోతే మేం చచ్చూరుకునే వాళ్లమనీ, ఇంకోసారలా చేస్తే లారీలో తీసికెళ్లి గుండ్లకమ్మలో వదిలేసి వస్తాననీ... ఇంకా ఏవోవో..

మేమంతా తలలొంచుకు నిలబడ్డాం.

మాట్లాళ్లేదు.

ఏం మాట్లాడాలి?

భాషా నావైపు దొంగ చూపులు చూశాడు.

నేను చూపులు మళ్లించుకున్నాను.

డ్రైవరు తంతాడు కాబోలు ననుకుంటూ ఉంటే వెనక్కెళ్లిపోయేడు.

'అమ్మయ్య' అనుకుని తలెత్తేను.

'వీడికి సరిగా బుద్ధి చెప్పాలి' అంటున్నాడు భాషా.

'అవునవును, లారీల వాళ్లందరికీ' వత్తాసు పలికేడు ఈశ్వర్రెడ్డి.

నేను వద్దంటే వాళ్లు వింటారా?

మర్నాడేం చెయ్యాలో వాళ్లు నిర్ణయించేశారు.

నన్ను గాజుపెంకులు తెమ్మన్నారు.

నేను తెల్లబోయి 'ఎందుకూ?' అన్నాను.

'తరవాత చెబుతాను తె'మ్మన్నాడు భాషా.

ఈశ్వర్రెడ్డి ఇనుప మేకులు తెస్తానన్నాడు


మర్నాడు సాయంకాలం ఎర్రనాగు దగ్గిర రోడ్డుకడ్డంగా మట్టి పోశాం.

నా కర్థమైంది ఇవన్నీ ఎందుకో.

కాని భయంగానే ఉంది.

'ఇవన్నీ ఎందుకు లెండ్రా' అంటే

## ఎలా!



"మీ ఆయన నిద్దట్లో పళ్లుకొరికేవాడని చెప్పేదానివి మానేసాడా!" అడిగింది కాంతం తన స్నేహితురాలు రాధని.

"ఆ.. మానేసాడే చెప్పింది కాంతం"

"ఎలా మానిపించావేమిటే!"

"ఎలాగూ మానేలా లేడని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి పళ్లన్నీ పీకించేసానే" నవ్వుతూ చెప్పింది కాంతం.

– ఎస్.జయా శ్రీనివాస్ (కాకినాడ).

వాళ్లు 'నీకు భయవేస్తే ఇంటికెళ్లిపో'మ్మన్నారు.

ఇంటికెళ్తే. నాకు భయవనుకోరూ?

ఇంకేవన్నా ఉందా?

రేపట్నుంచీ నన్నెగతాళి చెయ్యడం మొదలు పెడతారు.

అందుకనే బింకంగా ఉండిపోయాను.

మట్టికుప్పలో గాజుపెంకులూ, ఇనుపమేకులూ, తుమ్మముళ్లూ పెట్టేసేం.

లారీ పంక్షరు కావడం ఖాయం.

ఏదో లారీ వస్తుందన్నాడు భాషా.

అందరమూ వెళ్లి వాగులో దాక్కున్నాం.

పేరుకది వాగే కాని ఎప్పుడూ ఎండిపోయి ఉంటుంది.

గుండ్లకమ్మలో నీళ్లు ఎక్కువైతే ఈ వాగులోకి వస్తాయట.

గుండ్లకమ్మలో నీళ్లా ఎప్పటికీ ఎక్కువ కావు కాబోలు.

లారీ వచ్చేసింది.

మేం పోసిన మట్టికుప్ప మీదుగా ఎక్కి కాస్త దూరం వెళ్లి ఆగిపోయింది.

డ్రైవరూ, క్లీనరూ దిగి లారీ టైర్లని చూస్తున్నారు.

క్లీనరు కుర్రాడు ఉన్నట్టుండి వాగువైపు చూశాడు.

మేమూ తలెత్తి అప్పుడే వాళ్లని చూసేం

ఇంకేవుంది?

వాళ్లు కేకలు పెడుతూ మా వెంట పడ్డారు.

మేం పొలాలకి అడ్డంగా పరిగెత్తేం.

జవిలి చింతలదాకా మమ్మల్ని తరిమి మేం దొరక్కపోయేసరికి వెనక్కెళ్లేరు వాళ్లు.

అక్కణ్నుంచి మేం ఎవరిదారిన వాళ్లం వెళ్లేం ఇళ్లకి.

రాత్రంతా పీడకలలు.

మర్నాడు మిగతా ముగ్గురూ నా కోసం చూడకుండానే వెళ్లిపోయినట్టున్నారు స్కూలుకి.

ఇవ్వాళ నాదే ఆలస్యమా?

స్కూల్లో అడుగు పెట్టేసరికి ప్రార్థన గంట కొడుతున్నారు.

ప్రార్థన చెప్పాల్సింది నేనే!

నాకు గుండెల్లో గుబులుగానే ఉంది.

"ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల... " పద్యం ఎలాగో చెప్పేసేను.

అందరూ నన్నే చూస్తున్నారనిపించింది.

రత్నశ్వర్ రెడ్డి భాషాలు కనపడ్లేదు.

వాళ్లు స్కూలుకి రాలేదా?

జనగణమణ అయిపోయింది.

ఇంకా పుల్లారెడ్డి మాస్టారు 'డిస్పర్స్' చెప్పలేదు.

ఇంతలో హెడ్ మాస్టారు వేదిక మీదనుంచి 'సైలెన్స్' అన్నారు.

సైలెన్స్... లైసెన్స్.. ఒక్కలాగే ఉన్నాయి. ఉప్పుకప్పురాల్లా..

మెల్లగా తలెత్తి హెడ్మాస్టరు వైపు చూసేను.

"మీరంతా మంచి పిల్లలు.. ఏసీసీ కాడెట్స్ కూడా.. ఎప్పుడూ నిజవే చెప్పాలి.. అబద్ధం చెప్పకూడదు.."

ఇదంతా ఎందుకో నాకు నెమ్మదిగా అర్థమవసాగింది.

"నిన్న ఒక ఇన్సిడెంట్ జరిగింది..."

నా గుండెల్లో రాయి పడ్డది.

"కొంతమంది కుర్రాళ్లు రోడ్డుమీద మేకులు.. అవీ పెట్టి..."

కాళ్లక్రింది దుమ్ము కదుల్తోంది.

"ఎవరా పనిచేసింది... ముందుకు వచ్చి నిలబడండి.. లైక్ సిన్సియర్ ఏసీసీ కాడెట్స్. .."

నాకు వణుకు మొదలైంది.

ఇలాంటివంటే అసలే భయం నాకు.

వెంటనే వెళ్లి ముందు నిలబడ్డాను.

నా వెనక ఈశ్వర్రెడ్డి, భాషాలు ఉండాలి

ఉన్నారా?

వెనక్కి తిరిగి చూస్తే?

హెడ్మాస్టరు ఎందుకు నిలబడమన్నారు?

ఇక్కడే తంతారా?

తలెత్తి చూశాను.

పుల్లారెడ్డి మాస్టారు పేర్లు కాబోలు వ్రాసుకుంటున్నాడు.

మార్కులు తగ్గిస్తారా?

స్కూలు నుంచి పంపించి వేస్తారా?

నాన్నతో చెబుతారా?... తెలీదు.

ఫస్టవరు తరువాత పుల్లారెడ్డి మాస్టారు స్టాఫ్ రూముకి పిలిపించేరు.

నన్నొక్కణ్ణే!

అంటే...

మిగతా వాళ్లెవరూ నిజం చెప్పలేదన్న మాట!

అంటే...

తంతే నన్నొకణ్ణే...!

అంటే...

మిగతా వాళ్లెవరూ నిజం చెప్పలేదన్న మాట!

అంటే...

తిన్నాను.. తన్నులు.

వెధవలందరి మీదా కోపం... పిచ్చి


## దేవాలయాలు

భారతదేశంలో వున్నన్ని దేవాలయాలు ప్రపంచంలో మరెక్కడా లేవు. సుమారు 4,116 గుహాలయాలు, 32 లక్షలకు పైగా దేవాలయాలు వున్నాయి. ఇంకా ప్రతి సంవత్సరం కొన్ని వందలు పుట్టుకొస్తున్నాయి. ఒక్క కాశీలోనే 1500 దేవాలయాలు వున్నాయి.



వడ్డాక్టర్ అళ్ల

కోపంగా వుంది.

భాషా, ఈశ్వర్రెడ్డి, ఆశీర్వాదం, లారీ డ్రైవరు, క్లీనరు..

అసల్నేనేవీ చెయ్యలేదు.

అయినా.. ఇలాక్కాదు..

సాయంకాలం చెబుతాను వీళ్ల పని..

సాయంకాలం ఆ ముగ్గురూ ముందే బయల్దేరినట్టున్నారు.

వెధవలు నన్ను మాత్రం తన్నులు తినేలా చేసి...

చేతులింకా మండుతున్నాయి.

అదిగో... అక్కడ వెళుతున్నారు.

కొంచెం దగ్గరగా వెళ్లేను.

చేతికందిన రాయి తీసుకుని గట్టిగా విసిరేను... చేతికొద్దీ.

అది వెళ్లి ఈశ్వర్రెడ్డి తలకి తగిలినట్టుంది.

వాడు 'అమ్మా' అని అరుస్తూ కిందపడి పోయేడు.

గుండె గుభేలుమంది నాకు.

చచ్చిపోతాడా?

పరిగెత్తేను.

ఎటు?

ఇంటికెళితే నాన్న వీపు చీరేస్తాడు.

మరెటు?

జవిలి చింతల దగ్గరికెళుతూనే కనిపించింది వల్లగుండు.

అదే కరెక్ట్..

ఒక్కటే పరుగు..

మా ఊరికి దగ్గిరే.

పెద్దగుండు. చాలా పెద్దది.

అందులో చాలా సరులు (ప్వరులు)

గబ్బిలాల సరి

అంజల సరి..

ఇలా..

రాళ్లకి పెద్దపెద్ద తెనెపట్లు.

పక్కనే జారుడు బండ.

అదీ ఓ పెద్ద బండే!

మరోవైపు చిన్న దిగుడు బావి.

ఆంజనేయస్వామి పాలకడవ, నేతి కడవ కావిళ్లో తీసికెళుతూ ఉంటే నేతి కడవ పగిలి ఈ నల్లగుండయ్యిందిట.

పక్కనున్న రాళ్లన్నీ చిందిన నేతి చుక్కలుట!

సాయంకాలం.. అయినా దాహం.

బావిలో నీళ్లు తాగేను.

గుండెక్కి ఓ సరిలో పడుకున్నాను.

వాళ్లంతా ఇక్కడికొస్తారా?

వస్తే..

పోలీసులొస్తారా?

వస్తే.. పట్టుకుపోతారా?

వాడు చచ్చిపోయాడా?

చచ్చిపోతే దయ్యమవుతారా?..

చీకటి పడుతోంది...

ఆకలేస్తే?..

అప్పుడెప్పుడో పంటల్లేక ఆకలితో ఉన్నా జనం రేగడిమట్టిలో పెరుగు కలుపుకుని తిన్నారట.

ఇదంతా రేగడిమట్టే!

మరి పెరుగో..

నీళ్లు కలుపుకుంటే...

చచ్చిపోతానేమో?

నేనూ చచ్చిపోతే ఈశ్వర్రెడ్డి కనబడతాడా?

వాడు చచ్చిపోయుంటే నేను జైలుకెళ్లా లా...

వాడు మంచివాడే.. కాని మొద్దు.

నేనెందుకు జైలుకెళ్లాలి?

నేను రాయి విసిరాను.

వాడికి తాకుతుందనుకున్నానా?.. లేదు.

నేను చెబితే ఎవరన్నా నమ్ముతారా?

నమ్మకపోతే.. జైల్లో పెడతారా?

జైల్లో చీకటిగా ఉంటుంది.

ఆయుధపూజ రోజు నాన్నతో వెళ్లి చూసేవాణ్ణి. చుట్టూ చీకటి..

ఎవరో తట్టి లేపుతున్నారు.

చుట్టూ వెలుతురు.

తెల్లారిందా?.. ఎవరు?..

ఈశ్వర్రెడ్డి చచ్చిపోయాడా?.. దయ్యమా?..

కళ్లు తెరిచి చూశాను..

బాగా పొద్దెక్కింది.

పిచ్చయ్య.. మా తలారి.

''ఇంటికి పోదాం రా. నాన్న.. నాన్న పిలుస్తున్నాడు''

నాన్న?!

తన్నడానికేనా?

ఈశ్వర్రెడ్డి చచ్చిపోయాడా.. ఈశ్వర్రెడ్డి?

లేదుట. పిచ్చయ్య చెప్పేడు.

అమ్మయ్య. జైలుకెళ్లనక్కర్లేదు.

ఇంటికి బయల్దేరాను.

నాన్న కొడతాడా?

ఇల్లొచ్చింది.. ఊహూ.. నేనే ఇంటికొచ్చేశాడు.

నాన్న, అమ్మ, చుట్టుపక్కల ఇళ్లవాళ్లు..


అందరూ ఉన్నారక్కడ.

నాన్న తంతాడేమో.. భయం.

నాన్న ఏడుస్తున్నాడా?

అమ్మేడుస్తోంది.

పరిగెత్తుకుంటూ వెళ్లి అమ్మకాళ్లకి చుట్టుకు పోయేను.



అమ్మ నా తలమీద చెయ్యివేసి నిమురుతోంది.

ఈశ్వర్రెడ్డి మంచివాడు. వాణ్ణి కొట్టకూడదు.

"పద... పళ్లు తోముకుందూ గాని" అమ్మ.

నాన్న ఏవీ అనలేదు.

నేను పళ్లు తోముకుని చద్దన్నం తింటున్నాను.

"అయ్యగారూ.."

వెంకట. వెంకట మా మరో తలారి.

"ఏవిట్రా..?" అమ్మ బయటికెళ్లింది.

"అమ్మా.. బుద్దారెడ్డి కొడుకు.."

"ఊ.. ఈశ్వర్రెడ్డి.."

ఈశ్వర్రెడ్డి వస్తున్నాడా...

గబగబా లేచి బయటికెళ్లేను.

లేదు.

"ఆ పిల్లాడు చచ్చిపోయాడంటమ్మా..."

ఆ... ఈశ్వర్రెడ్డి చచ్చిపోయాడా?

పిచ్చయ్య చచ్చిపోలేదని చెప్పాడే.. అబద్ధమా..

నాన్నొచ్చేడు.

"ఎప్పుడ్రా?.. ఎట్లా చచ్చిపోయాడు?"

నా నోట్లో అన్నం ముద్ద అలాగే ఉంది.

అమ్మ నన్ను దగ్గరికి తీసుకుంది.

"ఇవ్వాళ పొద్దునయ్యా.. బడికి పోయేటప్పుడు. ఇసక లారీని ఆపమంటూ 'సడన్'గా అడ్డం పోయాడంట. లారీ కొట్టేసింది.. అక్కడికక్కడే ప్రాణం పోయిందంట..."

ఆపైన నాకేవీ వినపడ్లేదు.

నోట్లో అన్నం ముద్ద చేదుగా ఉంది. ●